క్లుప్తంగా

క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో విరాళం



కందనూలు: క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాల నిర్వాహణ కోసం క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాసా రాఘవేందర్ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా వ్యక్తిగతంగా ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు సమక్షంలో రూ.లక్షను క్లాస్‌మేట్ క్లబ్ రాష్ట్ర కోశాధికారి పరమేశ్వరయ్యకు అందజేశారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ రాష్ట్ర అధ్యక్షుడు దర్శి రాజయ్య, భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పోల శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ స్వామి, చంద్ర మోహన్‌రెడ్డి, రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తరిస్తాం



కల్వకుర్తిరూరల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో సామాజిక సేవా కార్యక్రమాలు, వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు లయన్ కలిమిచర్ల రమేశ్ అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ రమేశ్‌బాబును సన్మానించారు. కల్వకుర్తి లయన్స్ క్లబ్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా సతీష్‌బాబు వ్యవహరించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి వెంకటేశ్, సభ్యులు సత్యనారాయణ, అశోక్, రమేశ్, రమణ, రాఘవేందర్, ప్రవీణ్, నరేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదకు సాయం

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్‌కు చెందిన నిరుపేద శ్రీను ఇంటి మరమ్మతు చేపట్టారు. బీఆర్‌ఎస్ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సురేశ్‌గౌడ్ శ్రీనుకు 20 సంచుల సిమెంట్‌ను ఇంటి నిర్మాణం కోసం అందించి చేయూతనిచ్చారు. రాబోయే రోజుల్లో శ్రీనుకు అండగా ఉంటానని సురేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన వెంట భానుచందర్ ఉన్నారు.

దుప్పట్ల పంపిణీ



కోడేరు: మండల కేంద్రంలోని సత్యసాయి బాబ ఆలయంలో నిరుపేదలకు సత్యసాయి సేవా సమితి ద్వారా 20మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి సర్పంచ్ వెంకటస్వామి హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాఘవేంద్రశర్మ, మట్టయ్య, యుగేందర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలో కృష్ణమ్మ(40) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. సర్పంచ్ అశోక్ కుటుంబ సభ్యులను ఓదార్చి తనవంతు ఆర్థికసాయంగా రూ.3వేల నగదు, 50కేజీల బియ్యం మృతురాలి భర్త గోపాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్ తదితరులు ఉన్నారు.

లోగో ఆవిష్కరణ



కల్వకుర్తి టౌన్: క్రియేటీవ్ యువర్ బ్లడ్ బ్యాంక్ పేరుతో యూత్‌ఫర్ సేవా సమితి సభ్యులు రూపొందించిన లోగోను వైద్యుడు దామోదర్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రతిఒక్కరూ వారి ఫోన్‌లో ఏదైనా నెంబర్‌ను సేవ్ చేసే సమయంలో వారి బ్లడ్ గ్రూప్‌ను కూడా సేవ్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇలా చేయటం వల్ల ఆపద సమయంలో ఎవరికైనా బ్లడ్ అవసరమైతే తొందరగా సహాయం చేసిన వారవుతారని తెలిపారు. కార్యక్రమంలో యూత్‌ఫర్ సేవా సమితి సభ్యులు సందీప్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి పడిపూజ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో అయ్యప్ప స్వాములు ఆదివారం మహాపడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూజ అనంతరం అయ్యప్ప స్వాములు గ్రామంలోని పుర వీధుల గుండా ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి తిరుపతయ్య మాట్లాడుతూ ప్రజలు భక్తిభావాన్ని పెంపొందించుకుని సన్మార్గంలో పయనించాలని అన్నారు. కార్యక్రమంలో వెంకటస్వామి, శివశంకర్ గౌడ్, సురేశ్, ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.





అచ్చంపేటలో కేక్‌కట్ చేస్తున్న పట్టణవాసులు



లింగాలలో కేక్ కట్ చేస్తున్న యువకులు



పంజుగులలో కేక్ కట్‌చేస్తున్న సర్పంచ్ పద్మ



కుడికిల్లలోని ప్రార్థన మందిరంలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

అచ్చంపేట రూరల్: నూతన సంవత్సర వేడుకలను ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఇళ్ల వద్ద రంగురంగుల ముగ్గులను వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. తీపి వంటలు చేసుకున్నారు. పలు ఆలయాలు, చర్చీల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. చిన్నా, పెద్ద అందరూ ఉత్సాహంగా డ్యాన్స్‌లు చేస్తూ తమ ఆనందాలను వ్యక్తం చేశారు.

అమ్రాబాద్: అమ్రాబాద్, పదర మండలాల ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో పూజలు చేశారు.

దోమలపెంట(అచ్చంపేట): నూతన సంవత్సర వేడుకలను దోమలపెంట, ఈగలపెంట ప్రాంతాల్లోని ప్రజలు ఉత్సాహంగా నిర్వహించారు. టపాసులు కాల్చి ఆనందాలను వ్యక్తం చేశారు.



కొల్లాపూర్‌లో కేక్ కట్ చేసిన పోలీసులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు రంగురంగుల ముగ్గులు వేశారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. యువకులు, పెద్దలు అనే తేడా లేకుండా సంబురాల్లో మునిగి తేలారు.

కొల్లాపూర్: నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఆలయల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఆలయాల్లో, చర్చీలు పూజలు, ప్రార్థనలు చేశారు.

తెలకపల్లి: నూతన సంవత్సర వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి.

లింగాల: మండలంలోని ఆయా గ్రామాల్లో న్యూ ఇయర్ సంబురాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. యువకులు కేక్ కట్ చేసి, నృత్యాలు చేశారు.

బిజినేపల్లి: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఆలయాల్లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని వట్టెం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, పాలెం శ్రీవేంకటేశ్వరస్వామి, గంగారంలోని రామాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు.

తాడూరు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



అమ్రాబాద్‌లో..



ముగ్గు వేస్తున్న మహిళ



నాగర్‌కర్నూల్‌లో ఇళ్ల ముందు ముగ్గులు



పెంట్లవెల్లి సాయి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రామమందిరంలో పూజలు చేస్తున్న భక్తులు



బలాన్‌పల్లి సూర్యదేవాలయంలో..

విజయ్ దివస్‌ను పాఠ్యాంశాల్లో చేర్చాలి



అమ్రాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

అచ్చంపేట రూరల్: బీమా కోరేగావ్ విజయ్ దివస్‌ను పాఠ్యాంశాల్లో చేర్చాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం, మాల మహానాడు, మాలల ఐక్యవేదిక, బహుజన, కుల సంఘాల నాయకులు కోరారు. ఆదివారం రాత్రి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మూల భారతీయుల విజయ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కొవ్వొత్తులతో ఘన నివాళ్లర్పించారు. మూల భారతీయులు 1818 జనవరి 1న బీమా కొరేగావ్ ప్రాంతంలో కేవలం 500 మంది మూల భారతీయ సైనికులు సుమారు 28వేల పేశ్వా సైన్యంతో 12గంటల పాటు ఆహారం, నీరు లేకుండా వీరోచితంగా పోరాడి ప్రత్యర్థులను మట్టబెట్టారన్నారు. ఈ యోధుల స్ఫూర్తిని మహాత్మా జ్యోతిభాపూలే మనువాదులపై పోరాటాలు చేశారని గుర్తుచేశారు. బహుజన మేధావులపై భౌతిక దాడులను ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, జీవన్‌కుమార్, వెంకటేష్, సిద్ధార్థ్, నాగరాజు, పరుశరాం, సత్యం, నీరంజన్, లక్ష్మణ్, జనార్ధన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో..

అమ్రాబాద్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీమ్ కోరేగావ్ విజయోత్సవ దినాన్ని అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి బీమా కొరేగావ్ అమరులను స్మరించుకొని నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాసరయ్య, బాలకిష్టయ్య, రఘుపతిరావ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని లింగాల రోడ్డులో ఉన్న వెంకటేశ్వర ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వైకుంఠ ద్వారం ద్వారా భక్తులు వెళ్లడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశామని, భక్తులు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

ముస్తాబయిన వెంకటేశ్వరాలయం..

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర వైకుంఠ ద్వారా దర్శనం సందర్భంగా ఆలయం ముస్తాబైంది. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు సురేందర్, ఆలయ ధర్మకర్త జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెంట్లవెల్లిలోని వెంకటేశ్వర ఆలయం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ: రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ కృషి చేస్తుందని రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వెల్దండలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని మూడవసారి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. రైతుబంధు పథకంతో వ్యవసాయ పనులకు సకాలంలో రైతులకు డబ్బులు జమ అవుతున్నాయన్నారు. కేసీఆర్‌కు ప్రజలు అండగా ఉంటారన్నారు. నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో సర్పంచ్ శ్రీనివాసులు, సింగల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ..

మండలంలోని శంకరకొండతండాకు చెందిన మణిపాల్‌నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆదివారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా చెర్కూర్‌కు చెందిన అలియోద్దీన్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. యెన్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

ఆత్మకూర్: పట్టణంలో మతసామరస్యం వెల్లువిరిసింది. పట్టణానికి చెందిన ముస్లింలు అయ్యప్ప మాలాదారులకు అన్నదానం చేసి సోదరాభావాన్ని చాటుకున్నారు. పట్టణంలోని అయ్యప్పస్వామి సన్నిధానంలో ఆదివారం సిరాజ్, ఖాజాపాష, అనీస్‌అహ్మద్, లైక్‌పాష, అజ్హర్‌బేగ్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారికి అభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం దీక్షపరులకు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అనిల్, శ్రీను, శ్రీకాంత్, రఘు, చందు, గాడిలక్ష్మణ్, హర్షగౌడ్, బాలు, నరేష్, పాండు పాల్గొన్నారు.



ఆత్మకూరులో అన్నదానం చేస్తున్న ముస్లింలు

అంబులెన్స్ సర్వీసులు ప్రారంభం

కల్వకుర్తి టౌన్: ఆపద సమయాల్లో ఆర్థికంగా లేని వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ఫౌండేషన్ ముందుంటుందని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రి వద్ద ఫౌండేషన్ తరఫున ఆరు ఉచిత అంబులెన్స్ సర్వీసులను ఆయన ప్రారంభించారు. చాలా మంది నిరుపేదలు మెరుగైన వైద్యం కోసం ప్రధాన పట్టణాలకు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులను చూసి ఈ ఆలోచనకు శ్రీకారం చుట్టామని తెలిపారు. నియోజికవర్గంలోని పలు మండలాల్లో కూడా ఇలాంటి సేవలను త్వరలోనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని ఎంబీ చర్చిలో నూతన సంవత్సర వేడుకల ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వరప్రసాద్ రెడ్డి, పవన్‌కుమార్, శ్రీపతి, బాల్‌రెడ్డి, గణేష్, సభ్యులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న రాఘవేందర్ రెడ్డి

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

- ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోని వైనం
- రోడ్డు బాగాలేక బస్సులు రద్దు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



కంకరతేలి గుంతలుగా మారిన చెన్నంపల్లి రోడ్డు



కంకరతేలిన ఎర్రపెంట వెళ్లే రోడ్డు

లింగాల: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు నరకకూపాలుగా మారి ప్రమాదాలకు నిలయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాలకు బీటీ రోడ్డు ఉన్నప్పటికీ గుంతలమయంగా మారడంతో మరికొన్ని గ్రామాలకు నేటికి మట్టి రోడ్లే దిక్కు కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రెండేళ్ల నుంచి బస్సు రద్దు..

లింగాల నుంచి చెన్నంపల్లి, పద్మన్నపల్లి, ఎర్రపెంట బీటీ మార్గాలు గత కొన్నేళ్ల నుంచి మనమ్మతులకు నోచుకోకపోవడంతో గుంతలమయంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ మార్గంలో ఇతర గ్రామాలకు వెళ్లే వారితో ఎప్పుడు రద్దీగా ఉంటుంది. రోడ్డు బాగా లేకపోవడంతో బస్సులను రద్దు చేసి అప్పాయపల్లి ద్వారా నడుపుతున్నారు.

అధ్వాన్నంగా మారిన రోడ్లు ఇవే..

మండలంలోని చెన్నంపల్లి, క్యాంపు రాయవరం, రాయవరం, కొత్తచెర్వుతండా, జీల్గుపల్లి, జీల్గుపల్లి నుంచి కోమటికుంట బైపాస్ మార్గం, ఎర్రపెంట, పాతదారారం,ఎంసీ తండా మార్గాలు పూర్తిగా గుంతలమయంగా మారాయి. కొత్త చెర్వుతండా వెళ్లే మార్గం కంకర కావడంతో తరచుగా మొరం మట్టి పోస్తుండడంతో వర్షాకాలంలో బురదమయంగా మారి రాకపోకలు నిలిచి పోతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాగున్న రోడ్లకే నిధులు..

ఇటీవల ప్రభుత్వం కొన్ని రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. అందులో లింగాల నుంచి అచ్చంపేట, అదేవిధంగా లింగాల నుంచి అప్పాయపల్లి వెళ్లే మార్గాలకు నిధులు మంజూరు చేసినట్లు అధికారులు ప్రకటించారు. కానీ పూర్తిగా అధ్వాన్నంగా రోడ్లకు నిధులు మంజూరు చేయకపోవడమేమిటని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

రోడ్లు బాగు చేయాలి..



గ్రామీణ రోడ్ల బాగు కోసం ప్రభుత్వం నిధులను మంజూరు చేయాలి. చెన్నంపల్లి మార్గం బాగా లేకపోవడంతో రెండేళ్ల నుంచి బస్సులు రద్దు అయినా అధికారులు, పాలకులలో చలం రావడం లేదు. రోడ్ల బాగు కోసం వెంటనే నిధులు మంజూరు చేసి ఇబ్బందులు తొలగించాలి.

– శంకర్, పద్మన్నపల్లి

ప్రతిపాదనలు పంపించాం..

మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారుల మరమ్మతులకు నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– బాషునాయక్, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ

బంజారా కమిటీలు ఏర్పాటు చేస్తాం

లింగాల: మండలంలోని ఆయా గ్రామాల్లో త్వరలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు హతిరాంనాయక్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని మేరమ్మ భవాన ఆలయ ఆవరణలో మద్దిమడుగు పీఠాధిపతి, ఆల్ ఇండియా బంజార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయరాంనాయక్ ఆధ్వర్యంలో బంజారా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారాల ఐక్యత గురించి చర్చిండం జరిగిందని జిల్లా అధ్యక్షుడు తెలిపారు. గ్రామ కమిటీలను ఏర్పాటు చేసిన అనంతరం ఈనెల 15న మండల కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో నాయకులు భద్రునాయక్, మోతీరాంనాయక్, రాంజీనాయక్, రాందాసు, దేశ్యానాయక్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

నాగర్‌కర్నూల్ రూరల్: మూడు నెలలుగా గ్రామ పంచాయతీ వర్కర్లకు రావాల్సిన పెండింగ్ వేతనాలను చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జిల్లా యూనియన్ అధ్యక్షుడు వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు సరిగా వేతనాలు అందకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారి జీవనం గడపాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి పాలకులు కల్పిస్తున్నారని విమర్శించారు. ఓ వైపు మల్టీపర్పస్ పేరుతో వెట్టి చాకిరి చేయించుకుంటూ వేతనాలు సరిగా ఇవ్వకపోవడం దారుణమన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్, నాయకులు రాములు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.